

# మల్లికోసం

నారిగాడు హఠాత్తుగా ఉలిక్కి పడ్డాడు. తలెత్తి గూడెం వైపు చూశాడు. గూడెం వైపు నుండి మల్లి వగరుస్తూ పరుగెత్తుకొచ్చింది. ఆయాసంతో రొమ్ములు ముందుకు వచ్చాయి. మెడలోని ముత్యాల సరాలు చిందర వందరగా వున్నాయి. ఏవో భీభత్సరేఖలు ఆమె చూపుల్లో నుంచి తొంగిచూస్తున్నాయి. ఏదో భయానక దృశ్యాన్నుంచీ, ఆవలికి విసరివేసినట్లు కనిపిస్తున్న ఆమె వాలకం నారిగానికి ఆశ్చర్యాన్ని హృదయంలో కొద్దిపాటి జంకును కలిగించింది.

"ఏమిటే అట్టాగుండావ్" ఆదుర్దాగా, భయంగా అడిగాడు నారిగాడు.

మల్లి వెంటనే జవాబివ్వలేదు. ఒకసారి తను పరుగెత్తుకుంటూ వచ్చిన వైపు చూసింది. గుండెలపై రెండుచేతులు మోపుకుని 'హమ్మయ్య' అని నిట్టూర్చింది. స్థిమితంగా ఒక రాతిపై కూర్చుని, నారిగాడి కళ్ళల్లోకి చూసింది. నారిగాడికి చికాకు వేసింది. విసురుగా ఆమె ప్రక్కకు వెళ్ళి కూర్చున్నాడు. ఆమె భుజాన్ని చేతితో తట్టి ప్రశ్నించాడు. మల్లి బాధగా నారిగాడి కళ్ళల్లోకి చూసింది. ఆమె చూపులలో భయం, ఆందోళనా స్పష్టంగా గోచరిస్తున్నాయి.

"మామా! ఆడ వాని కాడ గోపాలం బాబు గారు నన్ను నిలదీసి — నిలదీసే ... " ఇంకా ఏమేమో చెప్పబోయింది మల్లి. ఎందుకో నారిగాడి కళ్ళల్లోకి జాలిగా చూసి, మళ్ళీ తలదించుకుంది.

"ఊ! నిలదీసే? — సరిగా చెప్పియేడు" గట్టిగా వురిమాడు నారిగాడు.

మల్లి కనుకొలుకుల్లో నీరు నిండింది. నారిగాడితో ఆ భయంకర సన్నివేశం చెప్పటమా, వద్దా అన్న సందిగ్ధంలో పడింది. చెప్పాలన్న ఆదుర్దా, వుత్సాహం, నారిగాడి వురుముతో నాశనమయ్యాయి. హృదయం భారంగా భయంతో మూలిగింది. నారిగాడు విసుగ్గా లేచాడు. కొడవలిని తీసుకుని మళ్ళీ గడ్డికోయడం ప్రారంభించాడు. మల్లికి ఈసారి ఆశ్చర్యమేసింది. తను ఎంత భయంగా, ఆందోళనగా వచ్చిందో, కనీసం తన భయానికి కారణమేమిటని కూడా ప్రశ్నించకుండా, అతని పనిలో నిమగ్నం కావటం ఆమెకు ఒక విధంగా ఆశాభంగాన్ని కలుగజేసింది. నారిగాడిపైన వున్న సదభిప్రాయం ఆచిన్న సంఘటన వల్ల మాయమయింది. నారిగాడు స్థిమితంగా తనకేమీ పట్టనట్లు కొంతదూరంలో చకచకా తన పని చేసుకుంటున్నాడు.

"మామా!" దీనంగా పిలిచింది, మల్లి.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూచాడు నారిగాడు.

"మరే —గోపాలం బాబు నన్ను బలవంతం చేశాడు మామా! ఆడి దుర్మార్గం మండిపోనూ, నన్ను నిలవేశాడు మామా! చేయి గట్టిగా పట్టుకుని, యేమిటేమిటో కూశాడు. ఎదవ సచ్చినోడు. తప్పించుకుని వచ్చా."

నారిగాడు చివాలున లేచాడు. ఒక్కవుదుటున మల్లి ముందుకుదూకి, ఆమె చేతిని గట్టిగా పట్టుకుని నొక్కాడు.

"ఏమన్నావు? నీవు గనుక సరిపోయింది. ఇంకొకరైతే తల బ్రద్దలుచేసి వుందును. గోపాలయ్య బాబుగారిని అంత మాటంటావా? నీ నాలుక చీలుస్తాను జాగ్రత్త!" మల్లిని విసురుగా, ప్రక్కకు నెట్టి కొడవలందుకుని, ఒకసారి మల్లివైపు తీక్షణంగా చూసి, గడ్డికోయటం ప్రారంభించాడు నారిగాడు. నారిగాడి తోపుకు క్రిందకు దొర్లింది మల్లి. నేలపైన మెత్తటిగడ్డి వున్నందువల్ల సరిపోయిందికానీ, లేకపోతే నారిగాడి చేతివాడుగా కాకుండానే ఆ రాళ్ళమీద ఆమెతల పగిలిపోయి వుండేది. మెల్లగా లేచి నిల్చుంది. నారిగాడివైపు చూచి, "ఛీ" అనుకుంది. దుఃఖం, అసహ్యం కలిగాయి. నారిగాడన్నా, వాడి మొరటు ప్రవర్తన, కొంచెం బాధను కలిగించాయి. కళ్ళు చిట్లించి, వాడివైపు కోపంగా చూసింది. ఆవేశం పౌరుషంతో నిండిన ఆమె హృదయం గట్టిగా నిట్టూర్చింది. తనకు కలిగిన అవమానాన్ని, అసమర్థతనూ నారిగాడికి చెప్పాలని, ఆమె వుద్దేశ్య పడింది కానీ, అతని నుండి యిలాంటి మొరటు ఫలితాన్ని ఆమె ఆశించలేదు. కనుకొలుకుల్లో నీళ్ళు తిరిగాయి. తన అసహాయస్థితిని నిందించుకుంటూ, కొన్ని గజాల దూరానవున్న నీటిగుంట వడ్డున ఒక రాతిబండపై కూర్చుంది. కాళ్ళను నీటిలోకి వ్రేలాడేసి, పాదాలతో నీళ్ళను కదిలిస్తూ, చిన్న అలజడిని కలుగజేసింది. ఆమె పాదాలు తాకిడి వల్ల ఏర్పడిన అలలు కదులుతూ, వుంటే ఆమె అలాగే ఆలోచిస్తూ కొన్ని క్షణాలు కూర్చుంది. కొలనులోని తరంగాలవలెనే, ఆమె మానస సరస్సులో కూడా యేవేవో ఆలోచనాతరంగాలు బయల్దేరాయి. ఆరోజు జరిగిన వింతసంఘటన ఆమె జీవితంలో ఏనాడూ వూహించని ఒక భయంకర సన్నివేశం. ఆమె యవ్వనాన్నీ, అందాన్ని, దోచుకోవాలనీ శాశ్వతంగా అనుభవించాలనీ, యెందరో కలలు కన్నారు. ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఎవ్వరి వలలోనూ మల్లి చిక్కలేదు. నారిగాడు ఆమె దైవం, ఆమె భర్త. ఎప్పుడూ నారిగాడిని వదలి ఒక్క క్షణం కూడా వుండదు. వారిద్దరి యిళ్ళు యిరుగు పొరుగువి. బాల్యంనుంచి, కలిసి మెలిసి యెంతో అన్యోన్యంగా తిరిగారు. వారి స్నేహం ప్రేమగా మారింది. ఒక బలీయమయిన ఆత్మీయ సంబంధాన్ని వారిద్దరి హృదయాల్లోనూ నెలకొల్పింది. యవ్వనం వచ్చేసరికి వారి హృదయాల్లోని కోరికలు బయటకు తొంగిచూశాయి. సహజంగా యవ్వనంలో ప్రతి యువకుడు


పో లూ రు శ్రీ

యువతి ఆశించే మధురానుభూతిని వారూ ఆశించారు. వారిద్దరి మనసులు ఏకమయ్యాయి. విడదీయని అనుబంధం వారి హృదయాలను, మనస్సులను కట్టివేసింది. ఒకరి నొకరు మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నారు. దానికి తోడుగా పేర్లు పెట్టి పిలిచారు. ఆ పల్లె వాసులు. వారిద్దరూ చిలకా, గోరంకల్లా వుంటారనీ, అనువైన జంట అనీ, ఆ పల్లీయుల ఉద్దేశ్యం. వారు ఆనాడు దీవించిన ఆ మాటలు వారి యువ్వనంలో నిజరూపం దాల్చబోతున్నాయి. అంటే, మల్లి, నారిగాడు, దంపతులు కాబోతున్నారన్నమాట.

మల్లి యువ్వనం, వయసు మిటారము అందమూ, అంగాల పొందిక ఆ గ్రామంలో అందరినీ ఆకర్షించాయి. ఎందరో యువకులు ఆమె ప్రేమను సంపాదించాలని ప్రయత్నించారు. వారి కెదురైంది ఆశాభంగమే. పేద వాడైన మల్లి తండ్రికి ధనాశ చూపించారు. కాని కూతురు మనసెరిగిన ఆ వృద్ధుడు వారిపై లక్ష్యపెట్టలేదు. సునిశితంగా తృణీకరించాడు. విఫలీకృతులయిన వ్యక్తులు మల్లి అందాన్ని ఆశించి యెలాగైనా అనుభవించాలని ప్రయత్నించారు గాని, మల్లికి, నారిగాడికి గల సంబంధం వారికి తెలుసు కనుక, నారిగాడి క్రోధానికి, ఆవేశానికి గురికావలసి వస్తుందని జడిసారు. నారిగాడంటే ఆ గ్రామంలో అందరికీ భయమే. బలమూ, శక్తి గలవాడని వారి వుద్దేశ్యం. పైగా గ్రామంలో హోదా, గౌరవం గల వ్యక్తి రాజ గోపాలంగారి నమ్మిన బంటు.

గోపాలం గంభీర ప్రకృతి గల వ్యక్తి. తను యేమిచేస్తాడో, తన నిర్ణయమేమిటో ఎవరికీ అర్ధంకానివ్వడు. కొన్ని సందర్భాలలో అతడు చెప్పే మాటలకు, చేసే చేతలకు చాలా తేడా వుంటుంది. ఆతని నిర్ణయమేమిటో, ఆపని యందు ఆతని వుద్దేశ్య మేమిటో అంత సులభంగా బోధపడదు.

గోపాలానికి అన్నివిధాల అనువైన బంటు నారిగాడు. మల్లిని అనుభవించాలన్న కోరిక ఆతనికి కూడా కలిగింది. యువ్వనోద్రేకంతో మత్తెక్కిన తన హృదయానికి ఆ ఆనందంతో శాంతిని కలుగజేయాలని నిర్ణయించుకున్నాడు. మల్లికి ఒకటి రెండుసార్లు తన హోదాను, గౌరవాన్ని గురించి చెప్పాడు. ధనాశ చూపించాడు. కాని ధర్మము, ప్రేమ, శీలము అంటే నమ్మకం గల ఆ యువతి ఆ డబ్బును ఆతని ముఖాన్నే చల్లి దూరంగా వెళ్లిపోయింది. గోపాలం హృదయం పగతో ప్రజ్వరిల్లినా అణుచుకున్నాడు. ఎలాగైనా ఆమెను అనుభవించి తీరాలని పట్టుదల కలిగింది. ఆరోజు వుదయం పొలం నుంచి వస్తుండగా, దారిలో మల్లి యెదురైంది. ఆతనిలోని మదం, పశుత్వంని రెచ్చగొట్టాయి. రెచ్చగొట్టిన ఆశ ఆతని హృదయంలోని మానవత్వాన్ని నశింపజేసింది.

పరిసరాలు చూశాడు. పొలాలన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. ఎక్కడో దూరాన చెట్ల చాటున నారిగాడు గడ్డి కోసుకుంటున్నాడు. మల్లిని గట్టిగా పట్టుకున్నాడు. బలవంతం చేశాడు. తన బలాన్ని, శక్తిని అంతా క్రోడీకరించి ఆమెను యెలాగైనా అనుభవించాలని సర్వవిధాల ప్రయత్నించాడు. కాని మల్లి యెలాగో చాకచక్యంగా ఆతని బలమైన చేతుల నుండి తప్పించుకుంది. దూరంగా పారిపోయింది. గోపాలం ఒకసారి చీత్కరించి, మీసం మెలివేసి ముందుకు సాగిపోయాడు.

మల్లి ఆ సంఘటనను, తనకు జరిగిన అవమానాన్ని నారిగాడికి చెప్పాలని యెంతో ఆందోళనతో, ఆదుర్దాతో వచ్చింది. కాని తన తన యజమానిని నిందించినందుకు! ఆవేశం పెరిగి అర్ధంకాకుండా ఆలోచించకుండా మల్లినే బెదిరించాడు. మల్లి మనసుకు చికాకు కలిగింది. తానొకటి తలుస్తే దైవమొకటి తలచాడు. తాను ఆశించింది ఒకటి, జరిగింది తనకు వ్యతిరేకంగాను, నిరాశా జనకంగానూ వుంది.

మవునంగా పాదాలతో నీళ్లను కదిలిస్తూ అలాగే నీళ్లపై తేలుతున్న తామర పూవులను అలలను గమనిస్తూ కూర్చుంది. నారిగాడంటే అసహ్యం, కోపం కలిగాయి. ఆలోచించినకొద్ది వాడిపైన ఉదాసీనత, అసహ్యం వృద్ధ వుతున్నాయి. నారిగాడు మాత్రం మవునంగా తన పనిలో నిమగ్నమయ్యాడు కనీసం మల్లివైపైనా చూడకుండ.

నారిగాడి విచిత్ర ప్రవర్తన మల్లికి ఆశ్చర్యాన్ని కలిగించింది. "ఛీ — రాతిగుండె" ఆమె మనసులో విసుక్కుంది." విషయం పూర్తిగా వినకుండా — సరిగా ఆలోచించకుండా యెంత తొందరపడ్డాడు. మనసు కుములుతుంటే యితగాడు కసురుకున్నాడు. ఏం మనిషి?—యిటు వంటోణ్ణి కట్టుకొనేను సుఖం" — మల్లి హృదయం చిరాకు"తో కొద్ది క్షణాలు మూలిగింది. చల్ల చిలికినట్టు ఆమె లేత హృదయం గగ్గోలు కలిగింది. ఒక్క క్షణం నారిగాడివైపు చూసింది. కండలు తీరిన శరీరం, లే యెండలో మెరుగులు దిద్దుకున్న పచ్చని శరీరం, యువ్వనంలో స్వేచ్ఛగా మెలిదిరిగిన మీసాలు, వెడల్పైన నుదురు నల్లటి కనుబొమలు, ఆమె హృదయాన్ని ఒక్క క్షణంపాటు పరవశత్వాన్ని కలుగజేశాయి. అనుకోకుండా ఆమె పెదాలపై సన్నని చిరునవ్వు తొంగి చూసింది. సిగ్గుతో తలవంచుకొని కొలనులోని తామర మొగ్గవైపు దృష్టి మరల్చింది. చేతికందిన మొగ్గను అందుకొని త్రుంచింది. రెండు చేతులతోనూ ఆ పుష్పాన్ని తీసుకొని నునుపైన చెక్కిళ్లకు అదుముకుంది.

"మామకంటి చక్కనోడు యెవరు?—
ఎంత మొరటోడో — మనసు అంత మెత్తనిది. కట్టుకుంటే మామనే కట్టుకోవాలి. లేకపోతే. . . . ." మల్లి ఆలోచనలకు అంతు లేదు. ఏవేవో అనూహ్యమైన భావాలు ఆమె హృదయంలో ఒక్క క్షణం చెంగేగి ఆమె మనసును పులకరింపచేస్తున్నాయి.

క్షణాలు, నిమిషాలు షుమారు ఒక గంట గడిచింది. నారిగాడు గడ్డి కోయటం ముగించి మోపు కట్టుకున్నాడు. చేతులకంటిన బురదను ఆకొలనులో కడుక్కొని మల్లికొరకు ఆపరిసరాలు చూశాడు. మెల్లిగా వెళ్ళి మల్లి ప్రక్కన కూర్చున్నాడు. మల్లివున్నట్టుండి అదిరి పడింది. రెప్పపాటు కాలం నారిగాడివైపు చూచి, అంతలోనే సిగ్గుతో తలవంచుకొని నీటిలో మునిగి వున్న తన పాదాలవైపు చూసుకుంది. నారిగాడు మెల్లగా మల్లిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. మల్లి బరువుగా కళ్ళు తెరిచింది. సిగ్గు, ప్రేమ నిండిన చూపులతో తీక్షణంగా చూసింది. "నన్ను త్వరగా కట్టుకో మామా!—యీ పాడులోకం ఓర్వలేనిది మామా!" నారిగాడు యేమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వి ఆమెను హృదయానికిగట్టిగా హత్తుకున్నాడు.

బాగా చీకటి పడింది. పల్లె పరిసరాలంతా నిశ్శబ్దవాతావరణాన్ని సృష్టించుకున్నాయి. ఎక్కడో పూరకుక్కలు అదేపనిగా అరుస్తున్నాయి. నారిగాడు పనంతా పూర్తి చేసుకున్నాడు. ఆకలేస్తున్నందుకు త్వరగా యింటికెళ్ళాలనుకున్నాడు. పశువుల దొడ్లో వున్న గొడ్లకు గడ్డి వేయాలని గొడ్ల చావిట్లోకి వచ్చాడు. ముందుగా గేదెలకు, ఆవులకు వేశాడు. ఎడ్లకు కూడా గడ్డి వేయటం ప్రారంభించాడు. కాని— వేయకుండనే— హఠాత్తుగా ఆగి పోయాడు.

నివ్వెరపోయి ఒకసారి గోపాలంగారి గదివైపు చూశాడు. గోపాలం భయంకర వికటాట్టహాసం, రక్షించమని నిస్సహాయంగా అర్ధించే మల్లి ఆర్తనాదం నారిగాణ్ణి ఒక్క క్షణం దిగ్భ్రాంతున్ని చేశాయి.

ఆవేశం, క్రోధం కలిగాయి. ఒక్క వుదటున చావిట్లో నుంచి పరుగెత్తాడు. హాల్లో నౌకరు అదగించినా లక్ష్యపెట్టకుండా మేడ మెట్లు యెక్కాడు. మల్లి దీనంగా మాట్లాడుతున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. గబగబా గోపాలం గది దాకా వెళ్ళాడు. తలుపు మూసివుంది. ఒకసారి తనలో వున్న పశుబలాన్నంతా వుపయోగించాడు నారిగాడు. లోపలిగడియ విరిగి గభాలున తలుపు తెరచుకుంది. హఠాత్తుగా జరిగిన ఆసంఘటనకు గోపాలం నివ్వెరపోయాడు. మల్లి నేలమీద పడివుంది. జుట్టు ముడి వీడిపోయింది. కట్టుకున్న గుడ్డలు చిందర వందరగా వున్నాయి. సిగలోని పూలు విడిపోయి గదంతా చిందర వందరగా చెల్లబడ్డాయి. నారిగాడి వైపు జాలిగా చూసి దూరంగా లేచి నిల్చుంది.

గోపాలం ఆశ్చర్యంగా చూస్తున్నాడు. తాను చేసిన ఆ ఘోరతప్పిదంవల్ల నారిగాడి క్రోధానికి వాడి పశుబలానికి ఆహుతికాక తప్పదేమోననిగోపా

లం అనుమానపడ్డాడు. ఐనా జంకినట్లు కనిపించక నిర్భయంగా నారిగాడి వైపు చూస్తూ నిల్చున్నాడు. నారిగాడికి మితి మీరిన వుద్రేకం కలిగింది. ఆవేశంలో యెదురుగొమ్ము మీదుకు వచ్చింది. తాను యేమి చేస్తున్నదీ, యేమి చేయబోతున్నదీ సరిగా అర్థం చేసుకునే స్థితిలోలేడు నారిగాడు. తటాలున అక్కడవున్న కుర్చీని అందుకొని గోపాలం తలపై బలంగా మోదాడు.గోపాలం గట్టిగా కేకవేసి క్రింద పడిపోయాడు. జరిగి ఆహటాత్సంఘటనకు ఆశ్చర్యం, భయం కలిగాయి మల్లికి. కెవ్వున కేకవేసి గూడెంవైపు పరుగెత్తింది మల్లి.—

నారిగాడు మల్లిని అనుసరించి పోయాడు. గది ద్వారం దాకా రాగానే గోపాలం మూలుగు బాధగా వినిపించింది. నారిగాడి నవనాడులు క్రుంగిపోయినంత పనయింది. హృదయం స్వామి భక్తితో నిట్టూర్చింది. గోపాలం మూలుగు ఆతని హృదయంలో ఒక వింత ప్రవర్తనను కలుగజేసింది. ఒక్కనిమిషంలో కోపం,ఆవేశం మటుమాయమయ్యాయి. కరుణ,జాలి, భక్తిముప్పిరిగొన్నాయి. కాలు ముందుకు సాగలేదు. భయంగా వెనుదిరిగి చూశాడు. గోపాలం నేలమీద బాధగా అటూ యిటూ దొర్లుతున్నాడు. తల, ముఖం పూర్తిగా రక్తంతో తడిసిపోయాయి."బాబూ!" అంటూ పరుగెత్తాడు నారిగాడు. గోపాలం దుస్థితిని నారిగాడు చూడలేకపోయాడు. గోపాలం యందున్న భక్తి, ఆప్యాయత వాడినలా చేసింది.

ఆపదలోవున్న యజమానికి సేవచేయాలన్న తాపత్రయం కలిగింది. తను ఆసమయంలో చేసినది నేరమయినా, ఆతర్వాత జరుగబోయే పరిణామాలు విషమమయినవైనా నారిగాడు అవన్నీ ఆలోచించే స్థితిలో లేడు. యజమానికి ప్రమాదం సంభవించినదని,సేవకుడిగా ఆతనికి సేవచేయాలన్న సంకల్పం కలిగింది. గోపాలంయందున్న భక్తి, ఆప్యాయత వాడినలా తయారు చేసింది.

మెల్లగా గోపాలం తలను తన తొడపై పెట్టు కున్నాడు. తన తలకు చుట్టు కొన్న పై పంచను గోపాలం తలకు తగిలిన గాయానికి కట్టాడు. గోపాలం మెల్లగా కళ్లుతెరిచాడు."బాబూ వణుకుతున్న కంఠంతో మెల్లగా పిలిచాడు. నారిగాడు. బాధగా నారిగాడి కళ్లల్లోకి చూశాడు గోపాలం. దాహం అన్నట్టుగా సంజ్ఞ చేశాడు. గోపాలం. గోపాలాన్ని మెల్లిగా బెడ్డుపై పడుకోబెట్టి,కూజాలో నీళ్ళు అందించాడు నారిగాడు. గోపాలం సంతృప్తిగా చూశాడు. బాధగా వుందిగాబోలు ఒకసారి మూలిగి మెల్లగా కళ్ళు మూసుకున్నాడు. నారిగాడి కన్నుల్లో నీరు నిండింది. పశ్చాత్తాపంతో హృదయం కుమిలి పోయింది. గోపాలం పాదాలను గట్టిగా పట్టుకున్నాడు నారిగాడు."నన్ను క్షమించు బాబూ!"నాస్వామికి ఎంత ద్రోహం చేశాను బాబూ! నన్ను పెంచి పెద్దచేసిన నా యజమాన్ని హింసించాను బాబూ! తప్పు జరిగింది. క్షమించు బాబూ!—"నారిగాడు గట్టిగా యేడ్చాడు. గోపాలం పాదాలను గట్టిగా పట్టుకొని నానా హంగామా చేశాడు. మంచానికి తన తలను బాదుకున్నాడు. దాదాపుగా ఆసమయంలో నారిగాడు ఒక పిచ్చి వాడులాగా కనిపించాడు.గోపాలం యేమీ మాట్లాడలేక పోయాడు. మాట్లాడే శక్తి, ఓపిక అతనికి లేవు. అప్పుడప్పుడు కనురెప్పలు బరువుగా తెరచి నారిగాడివైపు చూశాడు.

మరో అరగంట లోగా గ్రామమునసబు కొందరు పెద్దమనుషులు, డాక్టరు వచ్చారు ఖూనీ జరిగినదనో, లేక బలమైన గాయాలు తగిలి హత్యా ప్రయత్నము జరిగినదనో కేసు నమోదు చేసుకోవటానికి వారు వచ్చారు. నారిగాడు మాత్రం యేదో గొణుక్కుంటూ గోపాలం పాదాలను గట్టిగా పట్టుకొని కూర్చున్నాడు. గ్రామంలోని ప్రజలంతా ఆ భవనంలో ప్రోగు ఆయారు. డాక్టర్ గాయానికి కట్టు కట్టాడు. ఏదో యింజక్షలనుయిచ్చాడు. మరో అరగంటకు గోపాలం మెల్లగా కదిలాడు. తన చుట్టూ వున్న జనంవైపు అమాయకంగా చూశాడు. వారి చూపుల్లో భయం, ఆందోళన కన్పిస్తున్నాయి. నారిగాడు పాదాలను గట్టిగా పట్టుకొని యేదో గొణుగుతున్నాడు. నారిగాడి చూపుల్లో పశ్చాత్తాపాన్ని, స్వామిభక్తిని చూడగలిగాడు గోపాలం. ఆభవనంలో చేరిన జనం మధ్యలో చివర నిల్చొని "నా మామను నాకు అప్పగించు", అని చేతులుచాచి అర్థిస్తున్నట్లు జాలిగా చూస్తున్నది మల్లి. అసలు యీరభస కంతా తనే కారణమని ఆమె హృదయం చెప్పింది కాబోలు. కళ్లల్లో లీలగా కనిపిస్తున్న నీటిని తుడుచుకుంది. నౌకరు అందించిన పళ్ల రసాన్ని త్రాగాడు గోపాలం. అంతవరకు మవునంగా కూర్చున్న మునసబు తాపీగా చుట్ట ముట్టించి పొగవదిలాడు. తాను కూర్చున్న కుర్చీని గోపాలం మంచందాకా లాక్కున్నాడు.

"గోపాలంగారూ.— ఏం జరిగిందో వివరంగా చెబుతారా? మెల్లగా ప్రశ్నించాడు మునసబు. గోపాలం మెల్లగావరుసగామునసబువైపూ నారిగాడివైపు, ఆ తర్వాత మల్లివైపు చూశాడు. మల్లి కళ్లలోని నీరు స్పష్టంగా కన్పించాయి. గోపాలం వైపు-చూడలేక కాబోలు ఆమె తన రెండు చేతులతోనూ ముఖాన్ని కప్పుకుంది. "నాస్వామి నన్ను తప్పకుండా క్షమిస్తా" డని యేదో గొణుక్కుంటున్నాడు నారిగాడు.

గోపాలం అంత బాధలోనూ మెల్లిగా నవ్వాడు. గోపాలం యేమి చెబుతాడోనని ఆదుర్దాగా చూస్తున్నాడు మునసబు. ప్రజలదృష్టి అందరి దృష్టి అంతా గోపాలంపైనే కేంద్రీకరింప బడి వుంది.

"ఏమీ జరుగలేదు. దయచేసి మీరు వెళ్లండి మునసబు స్థంభించి పోయాడు. దాదాపుగా అక్కడ చేరిన ప్రజలంతా గోపాలం జవాబుకు ఆశ్చర్యం పొందారు. మునసబు మరింత దగ్గరగా జరిగి అన్నాడు. 'కేసు వ్రాసుకుందామని వచ్చాము. మీకిప్పుడు బాగా లేకపోతే తర్వాత వ్రాసుకుంటాము. మీకెలా వుందో చెప్పండి"

గోపాలానికి విసుగు కలిగింది. మునసబు వైపు తీక్షంగా చూశాడు.

"కేసేమీ లేదు.అసలు మిమ్మల్నెవరు పిల్చారు మీరు వెళ్లటం మంచిది".

మునసబు గార్కి ఆశ్చర్యం కలిగింది.

"మనసు స్థిమితంగాలేనట్టుంది. బాగ ఆలోచించండి".

గోపాలానికి కొద్దిగా కోపం కలిగింది.

"ఆలోచించవలసినది యేమీలేదు. అయినా మీనిర్బంధ మేమిటి. అదంతా నాయిష్టం".

మునసబుగారు మవునంగ లేచారు. అతనితో బాటు మిగతావారుకూడ లేచారు. అక్కడ గుమికూడిన జనం ఒక్కరొక్కరే వెళ్లిపోయారు.

"అవసరమైతే కబురు చేయండి మళ్లా వస్తాం' గుమ్మందాకావెళ్లిన మునసబు వెనుదిరిగి అన్నాడు. అందరూగోపాలానికి నమస్కరించి వెళ్లిపోయారు. నారిగాడు, మల్లి మాత్రం ఆ గదిలో మిగిలారు. వారి చూపులు కృతజ్ఞతతో నిండిపోయాయి. సంతోషం, సంతృప్తిలో నిండిన మల్లి చూపులు యెంతో మృదువుగా వున్నాయి.

నారిగాడు, మల్లి యిద్దరూ మెల్లగా గోపాలం పాదాలను స్పృశించారు. వారి హృదయాల్లో భక్తి, కృతజ్ఞతతో నిండిపోయాయి. గోపాలం దయాహృదయానికి జోహారు లర్పిస్తూ ఆయువ దంపతులను యేదో అస్పష్టంగా ఆశీర్వదించాడు గోపాలం.

ఆ తర్వాత వారం రోజులకె వారిద్దరి పెళ్లి జరిగింది· నారిగాడి తరఫున పెళ్లి పెద్దగా గోపాలం, గోపాలం యింట్లోనే వైభవంగా వారి పెళ్లి జరిగింది. ఆనాటిరాత్రి కృతజ్ఞతా సూచకంగా నారిగాడు, మల్లి గోపాలం పాదాలపై కొన్ని పుష్పాలను వుంచారు.

ఈ సంఘటన ఆ గ్రామీణులను సంభ్రమాశ్చర్యాలతో నింపింది.

★